క్లుప్తంగా

సదస్సు విజయవంతం చేయాలి


ప్రజలతో మాట్లాడుతున్న అంజయ్య

దొనకొండ: కనిగిరిలో ఈ నెల 23వ తేదీన వెలుగొండ జలాల సాధన సదస్సు విజయవంతం చేయాలని సీపీఎం కార్యదర్శి చిరుపల్లి అంజయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం, ఎన్టీఆర్ విగ్రహం, రైల్వే కాంప్లెక్స్, అంబేడ్కర్ బొమ్మ వద్ద, వీవీపురం, యర్రబాలెం గ్రామాల్లో ఆయన పర్యటించి వెలుగొండ జలాల సాధన సదస్సుకు తరలి రావాలని కోరారు. ముఖ్య అతిథిగా కామ్రేడ్ బీవీ రాఘవులు వస్తున్నారని చెప్పారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ


పాఠశాలకు అందజేస్తున్న కలర్ ప్రింటర్

కురిచేడు: స్థానిక వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–93లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు ఎప్సాన్ కలర్ ప్రింటర్‌ను మంగళవారం బహూకరించారు. ప్రధానోపాధ్యాయుడు జి. ఎస్ఆర్ సాయి, ఉపాధ్యాయుల సమక్షంలో పూర్వ విద్యార్థులు కోటా వెంకట సురేష్, గెల్లి మోహన్, పువ్వాడ బాబు, మేడం రమేష్, పెనుగొండ పరిమళాదేవి, శ్రీనివాసరావులు పాఠశాలలో ప్రింటర్‌ను అందజేశారు. పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయుల అవసరాల కోసం ప్రింటర్ బహూకరించినట్లు పేర్కొన్నారు. తాము చదివిన పాఠశాలతో పాటు విద్యాభివృద్ధి కోసం పాటుపడుతున్న పూర్వ విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు జీఎస్ఆర్ సాయి, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రానైట్ లారీలకు రూ.80 వేల జరిమానా


గ్రానైట్ లారీలను పరిశీలిస్తున్న ఎంవీఐ

ముండ్లమూరు (దర్శి): గ్రానైట్‌ను అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలకు రూ.80 వేల జరిమానా విధించారు. ముండ్లమూరు నుంచి అధిక లోడుతో తరలి వెళ్తున్న లారీలను ఎస్సై స్వాధీనం చేసుకున్నారు. అనుమతులకు సంబంధించిన కాగితాలు పరిశీలించారు. అనంతరం ఎంవీఐ రవికుమార్‌కు అప్పజెప్పగా ఆయన జరిమానా విధించారు.

పశువ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

ముండ్లమూరు (దర్శి): పశువ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి డాక్టర్ ఎం.విజయలక్ష్మి సూచించారు. మండలంలోని పసుపుగల్లులో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరగ కడుతున్న గేదెలు 8 ఎద ఇంజెక్షన్‌లు, 21 దూడలకు నట్టల నివారణ మందులు, 6 గేదెలకు సూది పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ పశువుల మేపే విధానం, వ్యాధులు గుర్తించే విధానంపై గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఏటీహెచ్ఏ వెంకటేశ్వర్లు, టీవీఓ కోటిలింగం, అటెండర్ శివశంకర్ పాల్గొన్నారు.

పాలిథిన్‌తో పర్యావరణానికి ముప్పు

● గ్రామాల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం



పెద్దదోర్నాల: పర్యావరణానికి పెను ప్రమాదంగా మారిన ప్లాస్టిక్ నిషేధం ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదు. దీంతో మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో పాలిథిన్ కవర్లు కుప్పలు కుప్పలుగా పేరుకునిపోయి పర్యావరణానికి ప్రమాదంగా మారుతున్నాయి. ఏళ్ల కాలంగా మానవ జీవితంతో విడదీయరాని బంధం ఏర్పరచుకున్న ప్లాస్టిక్‌ను నిషేధించటం అధికారులకు తలకు మించిన భారమైంది. పాలిథిన్ కవర్ల వినియోగం బాగా పెరగడంతో వాటిని దూరం చేసుకునేందుకు వినియోగదారుల నుంచి అధికారులకు ఆశించిన సహకారం లభించకపోవటంతో మార్కెట్‌లో పాలిథిన్ కవర్ల అమ్మకాలకు అడ్డు కట్ట వేయలేకపోతున్నారు. ప్రసిద్ధి గాంచిన శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ముఖ ద్వారంగా వెలుగొందుతున్న మండల కేంద్రంలో యాత్రికుల తాకిడి అధికంగా ఉంటుంది. దీంతో స్థానిక వ్యాపారులు, పండ్ల దుకాణదారులు, యాత్రికులకు అవసరమైన పండ్లు, ఫలహారాలు తినుబండారాలను ప్లాస్టిక్ కవర్లలోనే విక్రయిస్తుండటంతో యాత్రికులు శ్రీశైలం ప్రయాణించే మార్గంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లను వదలి పెడుతున్నారు. మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోయి పర్యావరణానికి పెనుముప్పుగా మారుతున్నాయి. అధికారుల ఉదాసీనత, వినియోగదారుల్లో చైతన్యం కొరవడటంతో ప్లాస్టిక్ కవర్ల పరంపర నేటికీ కొనసాగుతోంది. 20 మైక్రాన్ల కంటే ఎక్కువ మందం ఉండే ప్లాస్టిక్‌ను వినియోగించాల్సి ఉన్నా అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో 20 మైక్రాన్ల కంటే మందం తక్కువగా ఉన్న కవర్లనే పలుచోట్ల అమ్మకాలు కొనసాగిస్తున్నారు. నిషేధిత కవర్ల స్థానంలో ప్రత్యామ్నాయ వస్తువులైన కాటన్, నార, కాగితపు సంచులు మార్కెట్లోకి రంగప్రవేశం చేసినా ప్లాస్టిక్ కవర్ల నిషేధం అమలు కాకపోవటంతో వినియోగదారులు వీటిపై ఆసక్తి కనబరచడం లేదని పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు. అధికారులు స్థానికుల్లో ప్లాస్టిక్ వినియోగంతో సంభవించే ప్రమాదాలపై అవగాహన కల్పించి పర్యావరణానికి శత్రువుగా మారిన ప్లాస్టిక్ నిషేధానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. అటవీశాఖ అధికారులు శ్రీశైలం రహదారిలో ప్లాస్టిక్‌ను నిషేధించి ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా నల్లమల అడవులను తీర్చిదిద్దుతున్నా మిగిలిన ప్రాంతాల్లో మాత్రం ప్లాస్టిక్ నిషేధం అంతంత మాత్రంగానే ఉండటం పర్యావరణ ప్రేమికుల్లో ఆందోళన కలిగిస్తోంది.

విద్యుత్ స్తంభాల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

కురిచేడు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుపై ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను విద్యుత్ ఏఈ బి.రామకృష్ణ తన సిబ్బందితో మంగళవారం పరిశీలించారు. సాక్షి దినపత్రికలో గడ్డి బండి వస్తే గంట ఆగాల్సిందే అన్న శీర్షికన మంగళవారం ప్రచురితమైన వార్తా కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. రోడ్డు విస్తరణ సమయంలో విద్యుత్ స్తంభాల మార్పు, సామాన్ల కోసం వచ్చిన గ్రాంటు కాంట్రాక్టర్ విద్యుత్ శాఖకు చెల్లించలేదన్నారు. దీంతో విద్యుత్ స్తంభాలు మార్చలేదన్నారు. విద్యుత్ స్తంభాలు మార్చక పోవడంతో ఆక్రమణలు కూడా ముందుకు వచ్చాయన్నారు. సదరు కాంట్రాక్టరు లేక పంచాయతీ, రోడ్లు భవనాల శాఖ అధికారులు విద్యుత్ స్తంభాల మార్పుకు అయ్యే ఖర్చును విద్యుత్ శాఖకు చెల్లించి, విద్యుత్ లైనుకు అడ్డుగా ఉన్న ఆక్రమణలు తొలగిస్తే విద్యుత్ స్తంభాలు మార్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఏఈ రామకృష్ణ పేర్కొన్నారు.


రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న ఏఈ రామకృష్ణ

మిర్చిని తినేస్తున్న తామర పురుగు

● రైతుల ఆందోళన


కుచ్చు తెగులు సోకిన మిరప మొక్క


మిరప పూతను ఆశించిన తామర పురుగులు

పెద్దారవీడు: ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన మిరప పంట సాగు చేసిన రైతులు తెగుళ్ల సమస్యలతో సతమతమవుతున్నారు. వర్షాభావ పరిస్థితులు వెంటాడుతూనే ఉన్నాయి. మిర్చి పైరు బాగుందనుకుంటున్న సంతోషం రోజులు కూడా నిలువలేదు. మిర్చిపై తామర పురుగు దాడికి దిగడంతో అన్నదాతలకు ఆందోళన తప్పడం లేదు. మిర్చి ఏపుగా పెరగడంతో దిగుబడి అధికంగా వస్తుందన్న సమయంలో తామర పురుగు అతలాకుతలం చేస్తోంది. ఇటీవల మిర్చి పంటపై కొమ్మ తెగులు, కుచ్చు తెగులు ప్రభావం చూపించగా తాజాగా పూతలో తామర పురుగులు కనిపించడంతో పాటు వేరు కుళ్లు పురుగులు చుట్టుముట్టాయి. రాత్రింబవళ్లు కంటికి రెప్పలా పెంచుకున్న పంట కళ్లెదుటే వాడిపోతుంటే దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. ఎన్ని సార్లు రసాయన మందులు పిచికారీ చేసినా తామర పురుగు మాత్రం చావకపోగా పైరును పీల్చిపిప్పిజేసేసి రైతన్నలను కన్నీళ్లు పెట్టిస్తోంది. మండల పరిధిలో దాదాపు 7000 వేల ఎకరాలు మిర్చి పంట రైతులు సాగు చేశారని వ్యవసాయాధికారులు తెలిపారు.

తామర పురుగుతో పంట నాశనం

తామర పురుగు గుర్తించిన వారం రోజుల వ్యవధిలోనే పంట నాశనం అవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తామర గుడ్డు నుంచి పురుగుగా మారేందుకు 10–15 రోజులు పడుతుంది. ఇది తల్లి దశలో ఉన్న సమయంలో పూతలో పెరిగి పూత నుంచి కాయ రానివ్వకుండా రైతులకు తీవ్రంగా నష్టం కలిగిస్తుంది. మంచు కురిసే సమయంలో తామర పురుగు వ్యాప్తి విపరీతంగా పెరుగుతుంది. మిరపకు ఆశించిన ఆకుల్లో రసాన్ని పీల్చి ముడతగా మార్చేస్తుంది. ముడతతో పాటు మొగ్గలపై ప్రభావం చూపడంతో పూత నేల రాలిపోతోంది. ఒక వేళ అరకొర పూత మిగిలినా కాయ సైజు పొట్టిగా మారుతుంది. దీంతో దిగుబడి చాలా వరకు తగ్గిపోతుందని, ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్లకు మించి పంట రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే పలు రకాల రసాయన మదులు ఎన్నిసార్లు పిచికారీ చేసినా ఫలితం కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. ఎలాంటి తెగుళ్లు సోకకుండా ఉంటే ఎకరాకు 30 నుంచి 40 క్వింటాళ్లు దిగుబడి వచ్చేదని రైతులు చెబుతున్నారు. ఎరువులు, రసాయన ధరలు పెరగడంతో పెట్టుబడి మరింత భారం పెరిగింది. రైతులను అప్పుల నుంచి గట్టెకించే చర్యలు చేపట్టకుండా కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోందని రైతులు విమర్శిస్తున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు బీమా ప్రీమియం వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే భాగుండేదని రైతులు కోరుతున్నారు.

తామర పురుగుతో పంట నాశనం:



తామర పురుగుతో మిర్చి పంట నాశనమవుతోంది. రెండేకరాల్లో మిర్చి పంట సాగు చేశా. మొన్నటి వరకు మిర్చి పంట బాగానే ఉంది. ఉన్నట్టుండి మిర్చి పూతపై తామర పురుగు కనిపించింది. తామర పురుగు దాడి చేయడంతో పూత, లేత ఆకులు రాలిపోతున్నాయి. ఎన్నో రకాల రసాయన పురుగు మందులు పిచికారీ చేసినా నివారణ కావడం లేదు. ఇప్పటి వరకు రూ.1.20 లక్షలు పెట్టుబడి పెట్టా. ఎకరాకు 5 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం కూడా లేదు. ఏం చేయాలో అర్థంగాక దిక్కుతోచని పరిస్థితిలో రైతులు ఉన్నారు. ప్రభుత్వమే నష్టపోయిన మిర్చి రైతులను అదుకోవాలి.

– గొట్టం చిన్న సత్యనారాయణరెడ్డి, రైతు, పెద్దారవీడు

ఓటు మానవ జీవనానికి వజ్రాయుధం


విజేతలతో అధికారులు

యర్రగొండపాలెం: ఓటు మానవ జీవనానికి వజ్రాయుధంలాంటిదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బాలకిషోర్ అన్నారు. మంగళవారం ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక విద్యావనరుల కేంద్రంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులను ఓటు నమోదు, వినియోగం లాంటి అంశాలపై చైతన్యవంతులు చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఓటును అమ్ముకోవడం క్షమించరాని నేరమన్న విషయాన్ని యువత తెలుసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు మోదు చేసుకోవాలని కోరారు. పోటీల విజేతలు ఈ నెల 23వ తేదీన ఒంగోలులో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని, నియోజకవర్గ స్థాయిలో జరిగిన పోటీల విజేతలకు ఈ నెల 25వ తేదీన జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సర్టిఫికెట్లు, షీల్డ్ అందజేస్తారని ఎంఈవో పి.ఆంజనేయులు తెలిపారు. క్విజ్ పోటీల్లో జూనియర్స్ విభాగంలో దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ మదినాజ్, షేక్ బషీర్, కె.సామిక, సీనియర్ విభాగంలో వైపాలెం మోడల్ డిగ్రీ కళాశాలకు చెందిన బి.భరత్‌చంద్ర, షేక్ సుభానీ, ఎ.లక్ష్మీప్రసన్న, వ్యాసరచన పోటీల్లో జూనియర్స్ విభాగంలో త్రిపురాంతకం మండలానికి చెందిన కంకణాలపల్లి జెడ్పీ స్కూల్ విద్యార్థి ఎస్.రాజ్‌కుమార్, త్రిపురాంతకం జెడ్పీస్కూల్ విద్యార్థి ఆర్.సెక్రుతి, వైపాలెం క్రిష్ణవేణి స్కూల్ విద్యార్థినీ షేక్ రిజ్వాన, సీనియర్ విభాగంలో వైపాలెం డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి బి.భరత్‌చంద్ర, త్రిపురాంతకం గవర్నమెంట్ జూనియర్ కళాశాలకు చెందిన షేక్ తస్లీమా, పి.మోహిషిన్, వక్తృత్వ పోటీల్లో జూనియర్స్ విభాగానికి చెందిన వై.పాలెం క్రిష్ణవేణి స్కూల్ విద్యార్థి డి.హన్నాయాంగిల్, రైన్‌బో స్కూల్‌కు చెందిన కె.మైథిలి, గవర్నమెంట్ స్కూల్‌కు చెందిన విద్యార్థి డి.అనూష, సీనియర్స్ విభాగంలో త్రిపురాంతకం గవర్నమెంట్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినీ పి.తస్లీమా, వైపాలెం గవర్నమెంట్ జూనియర్ కళాశాలకు చెందిన బి.భరత్ చంద్ర, త్రిపురాంతకం గవర్నమెంట్ జూనియర్ కళాశాలకు చెందిన వి.వెంకట రమణ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో ఎలక్షన్ ప్రత్యేకాధికారి సత్యనారాయణ, డీటీ చంద్రశేఖరరావు, ఉపాధ్యాయులు గుల్షన్, ఆత్మానంద ప్రభాకర్, తిరుపతి నాయక్ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

యర్రగొండపాలెం: మండలంలోని మిల్లంపల్లికి సమీపంలో పేకాట శిబిరంపై మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించి ఆరుగురిని పట్టుకొని వారి వద్ద ఉన్న రూ.19,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. మిల్లంపల్లి పొల్లాల్లో వీరు పేకాట అడుతున్నట్లు సమాచారం తెలుసుకున్న ఎస్సై పి.చౌడయ్య తన సిబ్బందితో దాడులు చేసి వారిని అరెస్టు చేశారు. జూదరులను కోర్టులో హాజరు పరచనున్నట్లు ఆయన తెలిపారు.

విశ్వకర్మ నాయకుడు రాహుసాహెబ్‌కు నివాళి


రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు

యర్రగొండపాలెం: విశ్వకర్మ ముద్దుబిడ్డ, బ్రహ్మశ్రీ రాహుసాహెబ్ పండిత గానాల రామ్మూర్తి జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. తమ సామాజిక వర్గాన్ని బీసీ కులంగా గుర్తించేందుకు కృషి చేసిన ఆయన సేవలు చిరస్మరణీయమని, ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని సంఘీయుల అభ్యున్నతికి కృషి చేయాలని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్తలూరి మల్లికార్జునచారి కోరారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు జమ్మోజు వెంకటేశ్వరచారి, బొడ్డోజు బాలయోగి, రంగోజు మల్లికార్జునాచారి, లింగాల సత్యనారాయణచారి, జమ్మోజు బసవచారి, గుంటూరు వెంకటాచారి, లింగాల సుబ్రహ్మణ్యంచారి, ఆర్.మంత్రి, బి.విగ్నేష్ పాల్గొన్నారు.

ఎండ్లూరి సుధాకర్‌కు ఘన నివాళి


ఎండ్లూరికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

దర్శి: దళిత బహుజన కవి, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత దివంగత ఆచార్య ఎండ్లూరి సుధాకర్ జయంతిని రాజంపల్లి పొర్లి హైస్కూల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం అధ్యక్షతన మంగళవారం ఎండ్లూరి జయంతి సభ నిర్వహించారు. ఎండ్లూరి సుధకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఏకేఎస్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత అట్లూరి రామారావు 43 మంది విద్యార్థులకు 10వ తరగతి పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ్లూరి హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా, తెలుగు విశ్వవిద్యాలయాల ఈసీ నంబర్‌గా, హిందీ, ఉర్దూ కవితలు, పద్యాల లఘుచిత్రాల అనువాదకుడుగా ఎన్నో సేవలు అందించారని చెప్పారు. 16 పుస్తకాలు రచించి 30 అవార్డులు పొందారని చెప్పారు. ప్రన్సిపాల్ జి.ప్రసాద్‌రావు మాట్లాడుతూ అనేక మంది ఉద్యమకారులు, కవులు, కళాకారులు ఉన్న ప్రకాశం జిల్లాలో కేంద్ర సాహిత్య అవార్డు అందుకున్న ఎండ్లూరి జన్మించడం ఎంతో గర్వకారణమన్నారు. న్యూ ఆలియాస్ ఫౌండేషన్ అధినేత కొడవకంటి ప్రశాంత్, కళాశాల ట్రెజరర్ బి.పాల్ సన్ పాల్గొన్నారు.



తూర్పు గంగవరం ప్రధాన సెంటర్లో లైట్లు వేసుకొని ప్రయాణిస్తున్న వాహనాలు   తూర్పు గంగవరం-దర్శి ప్రధాన రోడ్డులో కమ్మేసిన పొగ మంచు

కమ్మేసిన పొగమంచు

తాళ్లూరు: మండలంలో మంగళవారం ఉదయం పొగ మంచు కమ్మేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 9 గంటల వరకు మంచు ప్రభావం తగ్గక పోవడంతో వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణాన్ని కొనసాగించారు. పొలం పనులకు వెళ్లే రైతులు ఉదయాన్నే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంచుకు తోడు చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో వృద్ధులు చలి తీవ్రతకు అల్లాడిపోయారు. వాహనదారులు ఎదురు వచ్చే వాహనాలు కనిపించక పోవడంతో తమ ప్రయాణాలను లైట్లు వేసుకొని నెమ్మదిగా కొనసాగించారు. తీవ్ర మంచు ప్రభావంతో తూర్పు గంగవరం–దర్శి ప్రధాన రహదారిలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు కూడా చలి తీవ్రత కనిపించింది.

కటకానిపల్లెలో పశువైద్య శిబిరం


మందులు అందజేస్తున్న పశువైద్యాధికారి

పెద్దదోర్నాల: మండల పరిధిలోని కటకానిపల్లెలో మంగళవారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో పశు వైద్యాధికారి అరుణ్‌కుమార్ పాల్గొని పశువులు, గొర్రెలు, దూడలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు, పశువుల్లో గర్భకోశ వ్యాధులకు చికిత్స చేసినట్లు తెలిపారు. 34 గేదెలు, 24 ఎద్దులు, 20 గేదెలు, 20 దూడలు, 1000 గొర్రెలు, 800 మేకలకు చికిత్స చేశారు. పశు పోషణ, పశువుల యాజమాన్యం గురించి రైతులకు వివరించినట్లు డాక్టర్ అరుణ్‌కుమార్ తెలిపారు. పారావెట్ రెడ్డిబాబు నాయక్, పశువైద్య సిబ్బంది సాయికుమార్, రమణారెడ్డి, యాసిన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాగి, కొర్రలు జనవరిలో విత్తుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న ఏఓ ప్రసాద్‌రావు

తాళ్లూరు: రాగి, కొర్రలు జనవరిలో విత్తుకోవచ్చని, అధిగ దిగుబడి ఇచ్చే రకాలను ఎంపిక చేసుకొని విత్తన శుద్ధి చేస్తే మంచి దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు అన్నారు. మంగళవారం శివరాంపురం, మాధవరం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగిలో అధిక దిగుబడినిచ్చే రకాలైన గోదావరి, శ్రీ చైతన్య, ఇంద్రావతి రకాలను ఎంపిక చేసుకొని ఎకరాకు నాలుగు కిలోలు వెదజల్లే పద్ధతిలో వాడుకోవాలని, కిలో విత్తనానికి రెండు గ్రాముల కార్బన్డిజం మందులను కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని తెలిపారు. దుక్కిలో ఎకరాకు ఐదు టన్నుల పశువుల ఎరువు వేసి కలియదున్నాలని సూచించారు. ఆత్మ ఏటీఎం కె.రామిరెడ్డి, వీఏఏ ఎం.రాజు, శేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కురిచేడు: దానిమ్మ పంటలో ప్రస్తుతం చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి ఉద్యానవనశాఖాధికారి సంధ్య వివరించారు. మండలంలోని పొట్లపాడు, పడమర గంగవరం గ్రామాల్లో సాగు చేసిన దానిమ్మ తోటలు, శనగ పంటలను ఆమె మంగళవారం వ్యవసాయాధికారి మధుబాబుతో కలిసి పరిశీలించారు. దానిమ్మ తోటలో ప్రస్తుతం బ్యాక్టీరియా మచ్చతెగులు, తామర పురుగు, బోరాన్ లోపం గమనించినట్లు తెలిపారు. బ్యాక్టీరియా మచ్చ తెగులు నివారణ కోసం కాపర్ హైడ్రాక్సైడ్ 53.8 శాతం 1.5–2 గ్రాములు లేదా స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ మరియు టెట్రాసైక్లోన్ హైడ్రోక్లోరైడ్ 0.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. తామర పురుగు నివారణకు క్లోరాంత్రనిలిప్రోల్, థయోమితక్సిమ్ 0.7 మిలీ లైదా స్పైనోశాడ్ 45 శాతం 0.5 మిలీ మందు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. బోరాన్ లోపంతో కాయలు గట్టిపడి పగుళ్లు ఏర్పడతాయన్నారు. దాని నివారణకు 20 గ్రాముల బోరాక్స్ 10 లీటర్ల నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పోలవరంలో మొక్కజొన్న పంటలో సామూహిక ప్రదర్శన క్షేత్రాలను వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ రబీలో పొగాకుకు బదులుగా ప్రభుత్వం మొక్కజొన్న, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఏడాది పొగాకు సాగుతో కలుపు అధికమవుతుందన్నారు. మొక్కజొన్న వంటి పంటలు మార్పిడి చేస్తే ఫలితాలు ఉంటాయని చెప్పారు. మొక్కజొన్న రైతులకు ప్రస్తుతం పంట పరిస్థితిపై శిక్షణ ఇచ్చారు. దశల వారీగా పురుగులు తగ్గుముఖం పట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మండల వ్యవసాయ సహాయకులు జీ ప్రదీప్, శోభారాణి, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ శుక్రవారం మండల పరిధిలోని కటకానిపల్లె, రామచంద్రకోటల్లో పర్యటించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించి మినుము, మిర్చి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఈ–పంట నమోదు, ఫార్మర్ రిజిస్ట్రీ, పీఎం కిసాన్, ఏపీఎస్ఏస్ యాప్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ చైతన్యకుమార్, శ్వేత పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: రైతులు రబీ సీజన్‌లో వేసుకున్న పంటలు ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కేవీ శేషారెడ్డి కోరారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని చెర్లో తండా, యర్రగొండపాలెం గ్రామాలకు చెందిన రైతులు సాగు చేస్తున్న కంది, మినుము, పొగాకు పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలపై సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎల్.మాల్యాద్రిరెడ్డి, ఆయా ప్రాంతాల రైతు భరోసా కేంద్రాల సిబ్బంది మంత్రూనాయక్, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

దొనకొండ: గ్రామాల్లో రబీ సీజన్‌లో పొగాకు సాగు చేసిన రైతులకు పంట నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ రైతు సేవా కేంద్ర సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం గంగదేవిపల్లి, పెదన్నపాలెం రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన రైతులతో మాట్లాడారు. రైతులు సహకరించి పొగాకు పంట నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం పొగాకు, మిర్చి పంటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలందించారు. సిబ్బంది అరుణాదేవి, వీణాకుమారి పాల్గొన్నారు.